# నిజానికీ ఫెమినిజానికీ మధ్య

--నిడదవోలు మాలతి

"మీ బిగికౌగిలిలో నన్ను బంధించారు"
సీత మొగుడు సీతాపతికి గాయత్రి రాసిన ఎనిమిది పేజీల ఉత్తరం పట్టుకుని సీత కూర్చుంది. సీతకి గొంతులో వెగటుగా ఉంది. సీత మొహం పాలిపోయింది.
గత నాలుగు వారాల్లో సీతాపతి ప్రవర్తన సీతకి కొత్తగా ఉంది. అతను హఠాత్తుగా ఇంటిపనుల్లో కల్పించుకోవడం మొదలుపెట్టాడు. సామాన్లు సర్దుతున్నాడు. గిన్నెలు కడుగుతున్నాడు. ఉతికిన బట్టలు మడతలు పెడుతున్నాడు. పిల్లల్ని కారులో తిప్పడానికి సిద్ధం అవుతున్నాడు. ఎటొచ్చీ పిల్లిద్దరూ పెద్దవాళ్లయిపోయారు అప్పటికి. అంచేత "నో, థాంక్స్ డాడీ" అనేసి సైకిళ్లేసుకు పోతున్నారు.
సీత ఆ కాయితాలు విసిరేసింది. ఇలాంటి ఉత్తరాలు చివరంటా చదవఖ్కర్లేదు. కాని ఆవిడ చూపులు అటూ ఇటూ తిరిగి మళ్లీ ఆ కాయితాలమీదే పడ్డాయి.
"23ఏళ్ల తరవాత ఆ ఒక్కరోజా..."
"వెళ్దాం అన్నారు మీరు"
"4.,5,6 తేదీల్లో రాసిన ఉత్తరాలు"
"మీ రహస్యం ఉత్తరం..."
"మా బాత్రూంలో మీరు మర్చిపోయిన వస్తువు..."
సీతకి ఒళ్లు మండిపోతోంది. ఆ కాయితాలు కాళ్లతో తొక్కిపారేయాలని ఉంది. కాని కాళ్లు రాలేదు. కాయితాలు సరస్వతి కదా! ఈ గాయత్రి విషయం దాచడానికేనా ఆయన అన్ని అవస్థలు పడుతున్నది?
అతను హఠాత్తుగా ఇంటివిషయాల్లో ఎక్కడ లేని ఉత్సాహం చూపించడం కొంచెం ఆశ్చర్యం కలిగించింది కాని, తను తనఅలవాట్లూ అభిప్రాయాలు మార్చుకున్నట్టే ఆయన కూడా మార్చుకున్నారనుకుంది. విజిటింగ్ ప్రొఫెసర్‌గా ఆర్నెల్లు ఇండియాలో ఉండి వచ్చిన సీతాపతి తనతో అంతకుముందు పదిహేడేళ్లు కాపురం చేసిన సీతాపతి కాడు.
"మీరక్కడ చెప్పిన పాఠాలకన్నా నేర్చుకు వచ్చిన పాఠాలే ఎక్కువలా ఉన్నాయే" అని తను వేళాకోళం చేసింది కూడాను, ఓ రోజు తను లేవకముందే లేచి కాఫీ పెట్టిన ఆయనతో.
"సరే. ఎప్పుడో అప్పుడు జ్ఞానోదయం కాకపోతుందా?" అన్నాడతను నవ్వి.
సీత కళ్లు మళ్లీ ఉత్తరంమీద వాలేయి. "మా బాత్రూంలో మర్చిపోయిన.." మొగాళ్లకి ఏముంటాయి కనక ఊడదీసి పక్కన పెట్టడానికి! ఏ వాచీయో గోచీయో అయి ఉంటుంది. గోచీ వదిలేసి వీధిలోకి వెళ్లలేరుకదా. వాచీయే అయి ఉండాలి. సీతాపతి తన వాచీ ఇండియాలో పాడైపోయిందని చెప్పాడు.
వంగి కాయితాలన్నీ తీసింది. ఏమిటి చెయ్యడం? ఇదిగో మీ ఉత్తరం అంటూ ఆయనకి మామూలుగా అందించడమా? దాచడమా? పారెయ్యడమా? ఆలోచిస్తూ ఒక్కొక్కటీ ముప్పై ముక్కలు చేసింది. ఫరవాలేదు. ఆయన ఈ ఒక్క ఉత్తరం చూడకపోతే మునిగిపోయిందేమీ లేదు.
"పదిహేడేళ్లనించీ బ్రేకు లేకుండా వంట చేస్తున్నావు. ఇవాళ నేను చేస్తాను, చెప్పు" అంటూ హుషారుగా వంటింట్లోకి వచ్చిన సీతాపతి, ఆవిడ అక్కడ లేకపోవడం చూసి కొంచెం తికమక పడ్డాడు.

రాణీ, బాబీ ఇంట్లో లేరు.
సీత పడగ్గదిలో ఉంది.
"ఏం, పడుకున్నావు? ఒంట్లో బాగులేదా?" అంటూ నుదుటిమీద చెయ్యి వేశాడు.
"గాయత్రి ఎవరు?" అంది సీత చెయ్యి తోసేస్తూ.
"ఎప్పుడో చిన్నప్పటి ఫ్రెండులే" అన్నాడతను తేలిగ్గా.
"కావలించుకు ముద్దు పెట్టుకునేంత ఫ్రెండా?"
"ముద్దెవరు పెట్టుకున్నారు?"
ఓ అరగంటసేపు వాదోపవాదాలయింతరవాత, సీతే వదిలేసింది. అతని మాటలు నమ్మికాదు, మాటల్లో అతనితో గెలవలేక.
సీతాపతికి మాత్రం సంతృప్తిగానే ఉంది. తనేం తప్పు చెయ్యలేదు. గాయత్రి ఏదో తన బాధలు చెప్పుకుని వెక్కి వెక్కి ఏడుస్తూంటే, మనసు ద్రవించి భుజంమీద చెయ్యి వేశాడు. చిన్నప్పట్నుంచీ తనంతే. ఎవరేనా బాధ పడుతుంటే తను చూడలేడు. ఓ మనిషి మరో మనిషిని కావలించుకున్నంత మాత్రాన ఏంవైపోయింది? తన బ్రహ్మచర్యానికి భంగం కాలేదు. ఆవిడ పాతివ్రత్యానికి భంగం కాలేదు. ఇందులో గొడవ చెయ్యాల్సినంత ఏమీ కనిపించడం లేదతనికి.

"ఇక రహస్యాలేం లేవు" అనే అనుకుంది సీత. ఆరాత్రి ఇండియానించి ఫోన్‌కాల్ వస్తే అతను మామూలుగా ఈమధ్య తనకి అన్నీ చెప్తున్నట్టుగానే చెప్తాడనుకుంది. కాని అతను ఆ విషయమే మాట్లాడలేదు. అంత కొంపలంటుకుపోయే విషయం కాకపోతే అర్ధరాత్రి ఫోనెందుకు చెయ్యడం?

మర్నాడు సీతాపతి మెయిల్‌బాక్స్‌లోంచి ఉత్తరాలు తీసి, ఒకటి మాత్రం జేబులో పెట్టుకుని, మిగిలినవి ఇంట్లోకి తీసుకొచ్చి సీతముందు పడేశాడు, "నువ్వు చూశాకే చూస్తాలే" అంటూ. సీతకి ఒళ్లు భగ్గున మండింది. "రంకు నేర్చినమ్మ బొంకనేర్వదా?" అన్న సామెత ఆడవాళ్ల పరంగానే ఎందుకొచ్చిందో ఆవిడకి అర్థం కాలేదు. ఆరోజు రెట్టించిన ఉత్సాహంతో సీతాపతి గదులన్నీ వాక్యూం చేశాడు. ఏవో కారణాలు చెప్పి పిల్లలిద్దరికీ బహుమానాలు కొన్నాడు. సీతని సినిమాకి తీసుకెళ్లాడు. సీత కూడా ఏమీ జరగనట్టే ప్రవర్తిస్తోంది. కాని కడుపులో బాధ అలాగే ఉంది.

రెండు రోజుల తరవాత సీతాపతి ఏదో కాన్ఫరెన్సుకి ఫిలడెల్ఫియా వెళ్లాడు. ఆరోజు మధ్యాన్నం పోస్టులో టెలిగ్రాం వచ్చింది "పెద్దవాడు కాలేజీలో చేరాడు" అని. ఆ గాయత్రి దగ్గిర్నుంచే. సీతకి మహా చిరాకేసింది. ఎవరిపిల్లాడో కాలేజీలో చేరితే ఈయనకెందుకు టెలిగ్రామ్? లేక వాడు "ఎవరిపిల్లాడో" కాదా? సీతకి మళ్లీ కడుపులో దేవినట్టయింది. తనభర్త తనదగ్గిర ఏదో దాస్తున్నాడు. ఎందుకు ఈ దాపరికాలు? విషయం పూర్తిగా తెలిస్తే కాని తనకి తోచదు. అతన్ని అర్థం చేసుకోడానికి కానీ, తన తృప్తికోసం కానీ ఇదేదో చివరంటా తెలుసుకోవాలి. ఆయన్ని అడిగి లాభం లేదు. గత పదిహేనురోజుల్లోనూ ఏవో అందీ పొందని సమాధానాలు చెప్పి విషయం డొంకదారి పట్టించేడే కాని తిన్నగా మాటాడలేదు.

మంచిగా, లాలనగా, దురుసుగా, పొగరుగా, కోపంగా తన నోరు మూయిస్తూనే వస్తున్నాడు కాని నిజం చెప్పడంలేదు. అక్కడికీ ఓసారి సూటిగా చెప్పింది కూడాను.
"నాకు మీమాటలు నమ్మకంగా లేవు.  నాకు పైవాళ్లతో మన విషయాలు మాటాడ్డం ఇష్టంలేదు. అందుచేత మిమ్మల్నే అడుగుతున్నాను," అని.
ఆరోజు కూడా సీతాపతి అతనికి అలవాటయిన మాటలే చెప్పాడు. "నాకు అబద్ధాలాడ్డం అంటే అసహ్యం " అన్నాడు.  "నీకు నామీద అనుమానంగా ఉందంటే నాకు చాలా కష్టంగా ఉంద"న్నాడు. "నలుగురిలో నాపరువేం కావాల"న్నాడు.  "మట్టిగడ్డల"న్నాడు.
సీత చివ్వున లేచింది. బేస్‌మెంట్‌లో అతనిబల్ల దగ్గిర చూసింది. అయిది నిముషాలు కూడా పట్టలేదు– ఫైళ్లమధ్య ఓ కట్ట ఉత్తరాలు, పుస్తకాలషెల్ఫులో ఇద్దరు ఆడవాళ్ల ఫొటోలు, ఓ పక్క చిన్న కాయితప్ముక్క మీద గిలికిన టెలిపోన్ నెంబరూ..
సీత ఉత్తరాలు పట్టుకుని కుర్చీలో కూలబడింది.  అవన్నీ ఒకళ్లు కాదు, ఇద్దరు కాదు, ముగ్గురు రాసినవి.
"మావారు ఊళ్లో లేరు. కొత్తచీర తీసి.."
"మీదగ్గిరకొచ్చి ఉండిపోవాలనుంది."
"మీరు మళ్లీ వచ్చినప్పుడు నాదగ్గిరే ఉండాలి."
"ఒంటరితనం, దిగులూ"
"పగలు మీ ఉత్తరాలకోసం, రాత్రి మీ ఫోన్‌కాల్‌కోసం"
"విమర్శక చక్రవర్తిగారు కాదు, అనుభూతి చక్రవర్తి..."
"మీమెడచుట్టూ చేతులు వెయ్యాలని ఉంది."
"మీచెవులు కొరకాలని ఉంది."
సీత చిరాగ్గా వాటిని బల్లమీద పడేసింది.
మళ్లీ తీసి తారీఖులు చూసింది. కొన్ని ఇక్కడికి వచ్చినవి, కొన్ని ఆయన అక్కడుండగా అందుకున్నవి.
సీతబుర్రలో ఆలోచనలు కందిరీగల్లా గందరగోళంగా సుళ్లు తిరుగుతున్నాయి.
సీతకి చిన్న నవ్వొచ్చింది. ఇక్కడ ఎంతోమంది –ఇండియాలో ఆడవాళ్లు అధోగతిలో ఉన్నారని తనతో వాదించారు. మనవాళ్లు సంపూర్ణ స్వాతంత్ర్యం సాధించారనడానికి ఈ ఉత్తరాలే సాక్ష్యం.  కాని ఆ స్వాతంత్ర్యంతో వాళ్లేం చేస్తున్నారు?

ఈ ఉత్తరాలు చూస్తుంటే, ఈఫొటోలు చూస్తుంటే, అవి దాచినతీరు చూస్తుంటే వట్టి స్నేహమే అనిపించడం లేదు. సీతాపతి చెప్పినట్టు వట్టి ఏడుపులూ, ఓదార్పులూ మాత్రమే అనిపించడంలేదు.
అనుభూతిచక్రవర్తిట! అనుభూతి ముందో? విమర్శ ముందో? మంచి ప్రశ్నే! ఈయన విమర్శకి ప్రతిఫలంగా ఆవిడ అనుభూతి అందించిందా? ఆవిడ అనుభూతి ప్రసాదిస్తే ఈయన విమర్శ అనుగ్రహించేరా? ఫరవాలేదు. మరోసారి ఈయన వెళ్లినప్పుడు "అనుభూతితో కూడిన విమర్శలకి సీతాపతిని సంప్రతించండి" అని ప్రకటించుకోవచ్చు.
మళ్లీ ఫొటోలు తీసి చూసింది. శోభాకుమారి అయి ఉంటుంది. చిన్నదే. ఈయనకి సకాలంలో పెళ్లయిఉంటే అంత కూతురుండేది.

సీతకి వెగటుగా ఉంది.
బాధగా ఉంది.
అసహ్యంగా ఉంది.
ఏదో చెయ్యాలని ఉంది.
కారు తీసుకెళ్లి ఏక్సిడెంటు చెయ్యాలని ఉంది.
ఎవర్నయినా చంపెయ్యాలని ఉంది- తను, ఆయన, పిల్లలు, ఆ ఆడాళ్లు -ఎవర్ని?
ఎదురుపడి వాళ్లని నిలదీసి అడగాలని ఉంది.
కాని, ఏమని? ఏముంది అడగడానికి? ఏమని అడుగుతుంది?
అడిగితే తన భర్తనే అడగాలి.
ఆయన్ని మాత్రం ఏమని అడుగుతుంది? పెళ్లయినవాళ్లతో ఏమిటనా? పిల్లలతల్లులతో సరసాలేమిటనా? ఇద్దరు పిల్లలతల్లికి రెండో మొగుడుగా ఉండడంలో ఉన్న ఆనందం ఏమిటనా? ఆడగడానికి ఏమీ లేదు.

సీత ఒక్కక్షణం కళ్లు మూసుకుంది. అసలుతన బాధ ఏమిటి? తనకే సరిగ్గా తెలీడంలేదు. మేజర్ బార్బరాలోలా తను చెక్కు చెదరని గంద్రశిలమీద నిల్చున్నానుకుంది. క్షణంలో సగంసేపు పట్టలేదు, కాళ్లకింద రాయి కొండచిలవలా జారిపోయింది.
సీతాపతికి కొన్ని విలువలు ఉన్నాయనీ, జాతిధర్మం, కులధర్మంలాంటివి కాకపోయినా కనీసం కొంతలో కొంతయినా డీసెన్సీ చూపిస్తాడనీ అనుకుంది.
తన్ని బాధపెడుతున్నది అదేలా ఉంది. ఆతను తనతో అబద్ధాలు చెప్తున్నాడు. ఎందుకు అన్నది అర్థం కావడం లేదు. అందువల్ల అతను సాధిస్తున్నది ఏమిటి?
కారు గరాజులో పెట్టి సీతాపతి ఇంట్లోకి వచ్చాడు.
"ఆ ఉత్తరాలు చూశాను" అంది సీత.
"ఏ ఉత్తరాలు?"
"మీ జనానా రాసినవి."
"మళ్లీనా? ఓ మాటు చెప్పానుకదా!"
"ఉత్తరాలు చూస్తే మీరు చెప్పినట్టు లేవు".
కథ మళ్లీ మొదటికొచ్చింది.
"వాళ్లు నాకోసం పడి కొట్టుకుంటున్నారు కాని నేను వాళ్లని పట్టించుకోడం లేదు కదా" అన్నాడు. "ఇప్పుడేం మునిగిపోయింద"న్నాడు. "నువ్వనుకున్నంత ప్రమాదం ఏం జరగలేద"న్నాడు.
"ఏదో ఘోరమయిన తప్పు జరిగి గాయత్రికి మతి చలించిందనీ, తను మళ్లీ ఆవిడకి ఆత్మ విశ్వాసం కలిగించడానికి ప్రయత్నిస్తున్నాన"నీ, అన్నాడు. "శోభ రచయిత్రి" అనీ "తెలుగు రచయిత్రులు అలాగే రాస్తార"నీ అన్నాడు. "వాళ్లు అలా రాస్తే నేనేం చెయ్యను?" అన్నాడు. "అలా రాయొద్దని వాళ్లకి రాస్తాలే" అన్నాడు.
సీతకి నమ్మకం కలగలేదు. కాని ఊరుకుంది.
"పిచ్చి పిచ్చి ఆలోచనలు మాని, పద, అలా వెళ్లొద్దాం" అన్నాడు.

"నేన్రాను. పిల్లలొచ్చే వేళయింది" అంది సీత విసుగ్గా.
"మరేం ఫరవాలేదులే. వాళ్లేం పాలు తాగే పసిపిల్లలు కారు. వస్తే వాళ్లే ఉంటారు".
సీత మాటాడకుండా లేచి గదిలోంచి వెళ్లిపోయింది.

* * *

బేస్మెంట్‌లో సీతాపతి పని చేసుకుంటున్నాడు. బెడ్రూంలో సీతకి ఆలోచనలతో తల పగిలిపోయేలా ఉంది. ఎందుకిలా జరిగింది? తనకి ఓపిక ఉన్నంతవరకూ సర్దుకుపోవడానికే ప్రయత్నించింది. "నా" అన్నవాళ్లు లేని ఈ దిక్కుమాలిన దేశంలో తనబతుకు ఏమిటి? పొద్దున్న లేచి కాఫీలు పెట్టడం, బ్రెక్‌ఫాస్టు, లంచ్‌మూటలు కట్టడం, పిల్లల్ని స్కూళ్లలో వదిలేసి తన పనికి వెళ్లడం, మళ్లీ వాళ్లని తీసుకు రావడం, బజారు పనులు, అంట్ల గిన్నెలు, మాసిన బట్టలు, చలికాలంలో మంచు ఎత్తి పోసుకోడం, ఎండాకాలంలో గడ్డి కోసుకోడం, ఆకులేరుకోడం--ఒళ్లలిసిపోయే పని కాకపోయినా, రోజంతా ఈ పనులతోనే తెల్లారిపోతుంది. వీటన్నిటిమధ్య ఓ క్షణం తీరిక దొరికితే ఊరికే కూచోవాలనుంటుంది కాని ఓ ఉత్తరమ్ముక్కేనా రాద్దాం అనిపించదు. ప్రతిచిన్నపనికీ మిషన్లున్న ఈ సంపన్నదేశంలో ఓ కప్పు కాఫీ కావాలంటే తను పెట్టుకుంటే ఉంది, లేకపోతే లేదు. వెధవది, ఓ కప్పుకాఫీ పెట్టుకుంటే మూడు గిన్నెలు కడగాలని, కాఫీ మానేసిన రోజులు చాలా ఉన్నాయి. తనకి రెండు రోజులకో సారయినా మన కూరలు తినకపోతే అన్నం తిన్నట్టుండదు. పిల్లలిద్దరికీ పూర్తిగా మూడుపూటలా అమెరికా వంటలే. ఆయన ఒప్పుకోరు కాని ఆయన ఇష్టాయిష్టాలు ఆయనకీ ఉన్నాయి.
వీటన్నిటిమధ్యా కుక్కకి పని లేదు, తీరుబడీ లేదు అన్నట్టు ఉంటుంది తన బతుకు. ఇవి చాలనట్టు సీతాపతి ఇంకే ఆచారాలూ పాటించకపోయినా అతిథిసేవలో ఏ పూర్వులకీ తీసిపోడు. తాను "సహధర్మచారిణి"గా చరించడం లేదనా అతని కక్ష?
అదేనా ఆయన పైవాళ్లదగ్గిరికి చేరడానికి కారణం? సీతకి ఎక్కడలేని నీరసం వచ్చింది. చిన్న నవ్వు కూడా వచ్చింది. సీతాపతి గాయత్రిలో ఆత్మవిశ్వాసం కలిగించాడో లేదో కాని తన ఆత్మవిశ్వాసం పాతాళాన్నంటింది. ఏడుపొచ్చినట్టుంది కాని రావడంలేదు. ఎవరితోనేనా మాటాడాలనిపించింది. కాని ఎవరితో? తను వాళ్ల బాధలు వింది కాని తనబాధ ఎప్పుడూ ఎవరితోనూ చెప్పుకోలేదు.
ఎవరున్నారిక్కడ? ఒక్కొక్కళ్లనే జ్ఞాపకం చేసుకుంది. ఉహు. లాభం లేదు. జరిగే పని కాదు. మనూళ్లోలా ఎప్పుడు పడితే అప్పుడు ఎవరింటికి పడితే వాళ్లింటికి –మనవాళ్లయినా సరే– వెళ్లడానికి వీల్లేదిక్కడ. "మాకు ప్లాన్లున్నాయం"టారు. "మాకు కంపెనీ వస్తుందం"టారు. "మేం మిమ్మల్ని ఎక్స్‌పెక్ట్ చెయ్యలేదం"టారు. "నెక్స్టైం కొంచెం ముందు ఫోన్ చెయ్యండం"టారు.

పోనీ, ఏదేనా సినిమాకి వెళ్తే? కూర్చున్నచోటినించి లేవాలనిపించలేదు. టీవీ ఆన్‌చేసింది. ఏదో డ్రామా. ఓ భార్య భర్తజేబులో మరో అమ్మాయి ఫొటో చూస్తుంది. సీతకి నవ్వొచ్చింది. స్వర్గానికెళ్లినా సవితిపోరు! ఆఫ్ చెయ్యబోయి ఆగిపోయింది. కథలో ఏమవుతుంది? జీవితంలో సినిమాల్లోలాగ జరక్కపోయినా అదో ఓదార్పు! టీవీభార్య బాధలు మరిచిపోవడానికి తాగడం మొదలుపెట్టింది. తను కూడా అలా చేస్తే? అందులో బాధ ఏమిటంటే బాధ మరిచిపోయేవరకు తాగాలి. అంత తాగింతరవాత తనేం చేస్తోందో తనకే తెలీదు. తనకి

కావలసిన జవాబు దొరికిందో లేదో కూడా తనకి తెలీదు. పిల్లలు జడుసుకుంటారు కూడాను. అయ్యవారిని చెయ్యబోయి కోతిని చేసినట్టు!
సీతకి పిచ్చెక్కిపోతోంది. ఏదో చెయ్యాలని ఉంది. కాని ఏంచెయ్యడమో తెలీడంలేదు. ఆఖరికి ఫోను తీసి కామాక్షిని పిలిచింది. ఆవిడ ఈదేశం వచ్చి పాతికేళ్లయింది.
"హలో!"
"నేనేనండీ"
"ఓ. ఏమిటి విశేషాలు?"
"ఏంలేవండీ... ఏంకూర?"
అవతల్నించి చిన్ననవ్వు వినిపించింది. "గుత్తొంకాయ. వస్తారా భోజనానికి?"
"మీరేదో హాస్యానికంటున్నట్టుంది. కాని నిజంగా వచ్చెయ్యగలను."
"లేదు. నేను హాస్యానికనడంలేదు. రండి."
పది నిముషాల్లో వస్తున్నానని చెప్పి ఫోను పెట్టేసింది సీత.

*   *   *

"నేనాంట్లో ఉండలేనండీ"
కామాక్షి సీతవేపు నిదానంగా చూసి "కాఫీ పెట్టనా?" అంది.
సీత సరేనన్నట్టు తలూపి, తన అనుమానాలు, బాధ, వీలయినంత క్లుప్తంగా చెప్పింది.
"ఆయన్తో మాటాడలేకపోయావా?"
"మాటాడాను. పైగా వేరేవాళ్లతో మాటాడ్డం నాకు ఇష్టంలేదని కూడా చెప్పాను. ఏవో సోది కబుర్లు చెప్పారు. అప్పటికి సబబుగా ఉన్నట్లే అనిపిస్తాయి. తీరా రెండ్రోజులు తిరిగేసరికి మరో ఉత్తరమో కాయితమో కనిపిస్తుంది. ఆయన బుర్రనిండా వాళ్లని గురించిన ఆలోచనలే అనుకోడానికి."
కామాక్షికి ఏమనడానికి తోచలేదు. ఆవిడకి తెలిసినంతవరకూ భార్యాభర్తలిద్దరూ మంచీ చెడ్డా తెలిసినవాళ్లే మరి.
"నిజానికి ఆలోచిస్తుంటే ఇప్పుడనిపిస్తోంది. ఆయన ఇవాళ ఓ సుబ్బమ్మతో పడుకున్నారా లేదా అన్నదానికంటే, పదేళ్లనించీ ఈయన వ్యాపకాలెప్పుడూ ఊరివాళ్లతోనే –వాళ్ల కష్టాలూ, కన్నీళ్లూ, వాళ్ల సమస్యలూ, ఆశలూ, అవసరాలూ, ఆరోగ్యాలూ, వాళ్లపిల్లల చదువులూ, పెళ్లిళ్లూ... ఇదే ఆయన లోకం. ఇప్పుడు అబద్ధాలూ, కావలించుకోడాల్లోకి దిగింతరవాత నేను మాత్రం ఏవో విలువలు అనుకుంటూ కూచోడం దేనికి అనిపిస్తోంది. ఇప్పుడు ఈయనగారి స్త్రీ జనోద్ధరణ పతాకదశకి చేరుకున్నట్టుంది" అంది సీత.
""వీరేశలింగంగారిలాగా!" అంది కామాక్షి వాతావరణం కొంచెం తేలిక పర్చే యత్నంలో.
"మరే!" అని సీత మళ్లీ నవ్వి, "లేదండీ. చిన్న తేడా వుంది. వీరేశలింగంగారు విధవలకి పెళ్లి చేసి ఉద్ధరిస్తే, ఈయన పెళ్లయినవాళ్లని పట్టుకుని, వాళ్ల మొగుళ్లని వెధవల్ని చేస్తున్నారు" అంది.
ఈసారి కామాక్షికి నిజంగా నవ్వొచ్చింది.
సీత మరో పావుగంట కూచుని "వెళ్లొస్తానండీ" అంటూ లేచింది.

ఎక్కువగా బాధ పడొద్దనీ, దేనికీ తొందర పడొద్దనీ ఆవిడ మరీమరీ చెప్పి పంపించింది.

*                    *            *

సీతకి మనసు కాస్త తేలిక పడ్డట్టనిపించినా బాధ అలాగే ఉంది. మనసు ఓరకంగా మొద్దు బారిపోయింది. ఇండియాలో ఆడవాళ్ల పరిస్థితిగురించి చాలామాట్లే వాదనలు జరిగాయి. అమెరిన్లతోనే కాక సీతాపతితో కూడా చాలాసార్లు వాదనలోకి దిగింది. అసలు తెలుగుదేశంలో ఆడవాళ్లకి చాలామందికి మొగవాళ్లే సపోర్టిచ్చారంది.
సీతాపతి ఒప్పుకోలేదు.
"వీరేశలింగంగారు వయసులో ఉన్న ఆడపిల్లలకి పెళ్లిళ్లు చేశారు. లేకపోతే వాళ్లు కనిపించిన మొగాళ్లందరి వెనకా పడి వాళ్లని నాశనం చేస్తారనీ, ఆడవాళ్ల చదువులు కూడా ఆయన దృష్టిలో వాళ్లు మంచిభార్యలుగా ఉండడానికే" అనీ వాదించాడు.
చలం కూడా అంతే అన్నాడు. చలం చెప్పిన స్త్రీ స్వాతంత్ర్యం మగాళ్లందరికీ సెక్సు అందించడానికే కదా అన్నాడు.
"ఐరనీ" ఎక్కడంటే ఇవాళ సీతాపతి చేస్తున్నదీ అదే!
"నామొగుడు నన్ను విలాసవస్తువుగా చూస్తున్నాడని మొత్తుకుంటున్న ఆడదాన్నీ, నాకు మావారు సంపూర్ణ స్వాతంత్ర్యం ఇచ్చారు అన్న ఆడదాన్నీ ఆయన సానుభూతిపేరుతోనో, అనుభూతిపేరుతోనో సాహిత్యచర్చల పేరుతోనో పక్కలోకే చేర్చారు! సీతకి తల బద్దలుకొట్టుకోవాలనిపించింది.

మల్లయుద్ధంలో మరో రౌండు– ఇద్దరూ అరగంట వాదించుకుని, "పోతే పో"మ్మనుకుని బేస్‌మెంటులోకొకరూ, బెడ్‌రూంలోకొకరూ వెళ్లిపోయారు.
సీతకి భర్తమాటలు నమ్మాలని ఉంది. పదిహేడేళ్లలో అతను ఎప్పుడూ మరీ అంత నీతిమాలినవాడిలా ప్రవర్తించలేదు. పైగా అతను కావాలనుకుంటే ఇక్కడ మాత్రం అవకాశాలు లేవూ? ఎందుకు ఇన్నాళ్లు ఆగడం? ఎందుకు ఎక్కడో వేషాలెయ్యడం? పైగా ఇదేం దాపరికం? నిజంగా వెధవపనులు చెయ్యదల్చుకుంటే ఇంత మరీ తనకి తెలిసేలాగానా? ఏమనుకోడం? అతితెలివా? తెలివితక్కువ తనమా?

*                    *                    *

వారంరోజులు గడిచాయి. సీత ఏదో పుస్తకంకోసం బేస్‌మెంట్‌లోకి వెళ్లి చూస్తుంటే ఒక పుస్తకంలోంచి ఓ కాయితం కింద పడింది. "గాయత్రికి..."
సీత తుళ్లిపడింది. ఇది మూడోసారి ఇలా జరగడం. రాణి తొమ్మిదేళ్లప్పుడు రాసిన రెండు లైన్లు జ్ఞాపకం వచ్చాయి.
"Believe me they say, trust me they say, then all of a sudden right when you were convinced something goes wrong."

చిన్న పిల్లయినా ఎంత తెలివిగా రాసింది! లేకపోతే ఇదేమిటి? సరిగ్గా తనని తను నమ్మించుకోడానికి ప్రయత్నిస్తుంటే ఈ ఉత్తరాలు నాలుగు – సీతాపతి గాయత్రికి రాసింది, గాయత్రి సీతాపతికి రాసింది, సీతాపతి శోభకి రాసింది, శోభ సీతాపతికి రాసింది...
సీతకి కళ్లు తిరుగుతున్నట్టనిపించి, కుర్చీలో కూలబడింది. ఆనాలుగు ఉత్తరాలూ చూసిన ఎలాంటి వెర్రిదానికైనా స్పష్టంగా, సుస్పష్టంగా తెలుస్తుంది ఇంతవరకూ సీతాపతి చెప్పినవన్నీ కల్లబొల్లి కబుర్లేనని.
"మిమ్మల్ని కౌగలించుకోవాలని ఉంది"
"ముద్దు పెట్టుకోవాలని ఉంది"
"మీతో ఖజురహో చూడాలని ఉంది"
"పుట్టుమచ్చలగురించి మీకు ఇంత ఎలా తెలుసా అని ఆశ్చర్యంగా ఉంది."
"ఇల్లు ఖాళీ అయింది. ఫరవాలేదు."
"సైజు 34 బ్రాలు తెండి. బంగారం తెండి. నైలాన్ కోకలు తెండి. కెమెరా తెండి"
సీత అర్థం చేసుకోడానికి ప్రయత్నం చేస్తున్నట్టు కొంచెంసేపు ఆగింది. మళ్లీ చదవడం మొదలుపెట్టింది.
సీతని గుండెల్లో సూటిగా పొడిచింది తన భర్త శోభకి రాసిన ఉత్తరం.
"నీకు నన్ను కావిలించుకోడానికి హక్కుంది. ముద్దు పెట్టుకోడానికి హక్కుంది. నాతో వచ్చి ఖజురహో చూడ్డానికి హక్కుంది."
సీతకి ఊపిరాడనట్టుగా ఉంది. ఆ కాయితాలలాగే పట్టుకుని మెల్లిగా పైకి వచ్చింది. సోఫాలో కూచుంటే బయట మంచు ఉప్పుపొడిలా కనిపిస్తోంది.
"కావిలించుకుని ముద్దు పెట్టుకోడానికి హక్కుంది"
తనకున్న హక్కులేమిటి? చలిలో మంచు ఎత్తి పోసుకోడం, ఎండలో లాను "మో"చేసుకోడమూనా? బట్టలుతుక్కోడమూ, బజార్లు చేసుకోడమూనా?
ఒకసారి వాదన వచ్చినప్పుడు సీత చెప్పింది, "సరదాలకి వాళ్లూ, సంసారానికీ, సంఘంలో పరువుకీ నేనూ అంటే మాత్రం నేనీ ఇంట్లో ఉండన"ని.

సరిగ్గా ఇప్పుడదే జరిగింది. సీతకి ఇక అక్కడ ఒక్క క్షణం కూడా ఉండలేననిపించింది. అలా అనుకున్న తరవాత మనసు తేలిక పడింది. ఇన్నాళ్లకి ఆకలి తెలిసింది. గబగబా వంట చెయ్యడం మొదలు పెట్టింది.
"నన్ను అర్థం చేసుకున్నదానివి నువ్వొక్కదానివే..."
"ఈసారి ఎక్కువరోజులుండడం పడదు."
ఉత్తరాల్లో వాక్యాలు వేటకుక్కల్లా తరుముతున్నాయి.
హఠాత్తుగా సీతకి పెళ్లయిన కొత్తలో తను ఆయనకి రాసిన ఉత్తరాలు జ్ఞాపకం వచ్చాయి. అవెక్కడున్నాయో తనకి తెలుసు. గబగబా వెళ్లి తీసుకొచ్చి ఒక్కొక్కటే చూడ్డం మొదలు పెట్టింది.
"కన్ను మూసి తెరిచేలోగా పెళ్లయిపోయింది."
"ఇక్కడ కూడా ఆకాశం నీలంగానూ, వాతావరణం చల్లగానూ ఉంది."
"తమరితో సప్తపాదాలు తొక్కి సాధించిన కొత్త హోదాతో"
"ఏంకావాలని రాస్తే నువ్వొస్తే చాలని రాసిన ఉత్తరం..."

"ఏదో రాయలని ఉంది కాని ఏంరాయాలో తెలీడంలేదు."
"ఊరికి దూరంగా... సాలిట్యూడ్ ఈజ్ స్వీట్ అనే స్నేహితుని పక్కన నడుస్తూ..."
"ప్రతి మనిషికి ఎన్నో పొరలుంటాయి. మీరు నన్ను ఆఫీసులో చూసి ఉంటే...."

ఆవిడకి ఎక్కడలేని నీరసం వచ్చింది. తొలిసారిగా కళ్లలో నీళ్లు చిప్పిల్లాయి. పదిహేడేళ్లలో ఏం జరిగింది? ఎందుకిలా జరిగింది? ఆయనెప్పుడూ తనని కొట్టలేదు. తిట్టలేదు. తనేం చేసినా అడ్డు చెప్పలేదు. పైగా నీకేం కావలిస్తే అదే చెయ్యి అంటూనే ఉన్నారు. ఎటొచ్చీ తనకి తెలివొచ్చి తనకి ఏంకావలిస్తే అది చేసుకోడానికి ఆయన సరదాలూ, పనులూ ఉద్యోగమూ అడ్డొస్తున్నాయని తెలిసేసరికి అరేళ్లు గడిచిపోయాయి. సీతాపతి తనకిచ్చిన స్వాతంత్ర్యంలో బోలెడు బాధ్యతలున్నాయి - డబ్బు బాధ్యత, పిల్లలబాధ్యత, వచ్చే పోయే చుట్టాల బాధ్యత, ఇంటి బాధ్యత,..
"నువ్వే బాగా చేస్తావు" అంటూ అన్నీ తనమీద వదిలేసి నిష్పూచీగా స్నేహితులతో కాలక్షేపం చెయ్యడం అలవాటు చేసుకున్నాడు.

సీత ఆయన వాదనలు మరో సారి మననం చేసుకుంది -- పొద్దున్న ఏడున్నరకి ఇంట్లో బయల్దేరితే సాయంత్రం అయిదున్నరకి వస్తాడు. మధ్యలో ఉద్యోగం నిలబెట్టుకోడంకోసం, ప్రమోషన్లకోసం, తన విలువ రుజువు చేసుకోడం కోసం, అడ్డమైనవాళ్లనీ ఇరవై నాలుగ్గంటలూ హుషారు చేస్తూండాలి. ఇంత కష్టపడి ఇంటికొస్తే పెళ్లాం కాస్త చిర్నవ్వుతో కనిపించాలనుకోడమూ తప్పేనా? పిల్లలేరీ అనడిగితే తప్పా? ఫోన్ కాల్సొచ్చాయా అంటే ఎందుకంత కోపం? ఊళ్లోవాళ్లతో ఉన్నట్టు కట్టుకున్న పెళ్లాంతో కూడా ఉండాలంటే పెళ్లెందుకు చేసుకోడం? అమెరికా పెళ్లాలు మొగుళ్లకి బట్టలు -వాళ్లే కొంటారు. సీత తనకి కొనదు. సరికదా బజారుకి వెళ్తే తను ఎంచిన బట్టలు బావులేవంటుంది. తనకి చిన్నప్పట్నించీ సృష్టిలో అందాలంటే పరవశం. కాని అందంగా ఉన్నావంటే విసుక్కుంటుంది...

సీత నిట్టూర్పు విడిచింది. ఆయన అలా అనుకోడానికి కాదు తాను తప్పు పడుతున్నది. ఆయన ఆలోచనల్లో కలల్లో తను రోజూ చేసే వెట్టి చాకిరీ లెక్కలోకి రాదు. అమెరికా పెళ్లాల్లా తను ఉండదని దెప్పుతారు కాని అమెరికా మొగుళ్లు చేసే పనుల్లో సగం కూడా ఆయన పట్టించుకోరు. అసలాయన ఇద్దరు ముగ్గురితో వ్యవహారాలు నడుపుతున్నారంటేనే తెలుస్తోంది- ఆయన స్వప్నసుందరి ఒక్కమూసలో నించి వచ్చే అచ్చు కాదని!

మూడేళ్లకిందట ఇలాటివాదనే వచ్చినప్పుడు, "మీక్కావలసినలాంటి ఆడవాళ్లు వేరే ఉంటారు చూసుకోండి" అని తను అంటే, "వేరే ఆడవాళ్లని నేను చూసుకుంటానని నువ్వు అనుకుంటే నీకు నాగురించి ఏమీ తెలీదన్నమాట" అన్నాడు అతను.
ఇది మూడేళ్లకిందటి మాట. ఇప్పుడు?
జీవితం ఇంతే. రోజులూ, నెలలూ గడిచిపోతాయి. మనుషులు తమకి తెలీకుండానే మారిపోతారు. ఆలోచనలూ, అభిప్రాయాలూ మారిపోతాయి.

గణగణగణ....

ఫైరలారం మోతతో సీతకి తెలివొచ్చింది. వంటింట్లో కూర మాడి, బొగ్గులై , పొగలొచ్చి ఫైరలారం తగులుకుంది పొలోమంటూ.

సీత స్టౌ ఆఫ్ చేసి, బెడ్రూంలోకి వెళ్లింది బట్టలు తీసుకోడానికి. వంగి సూట్‌కేస్ తియ్యబోతూంటే చీరపొరల్లో మంగళసూత్రాలు చిన్న చప్పుడు చేశాయి– ఎద్దు మెళ్లో గంటల్లా. అంతే మరి. సీతాపతి మారిపోయాడు. అతని విలువలు మారిపోయాయి. అతను ఇవాళ పెళ్లికి కొత్త నిర్వచనం చెప్తున్నాడు. సీత మెళ్లోంచి మంగళసూత్రాలు తీసి పెట్లో పడేసింది.

గరాజ్ చప్పుడయింది. అతను వచ్చాడు. ముందుగదిలో సీత కనిపించకంపోవడంతో పడగ్గదిలోకి వచ్చాడు, "మళ్లీ ఏమైంది," అంటూ.

"నేను వేరే అపార్ట్‌మెంట్‌లోకి మారిపోతున్నాను," అంది సీత పెట్టె సద్దుకుంటూ.

సీతాపతి నవ్వేడు. "మళ్లీ ఏమైయింది?" అన్నాడు దగ్గిరకొచ్చి తలమీద చెయ్యివెయ్యబోతూ.

సీతాపతి విదిలించుకుంది. "ఇంతవరకూ నెత్తిన చెయ్యి పెట్టింది చాలు" అంటూ.

"అసలేమయిందంటే?"

"మీ ముండల్లో ఓ ముండగా నేనుండనని మీకు ముందే చెప్పాను."

సీతాపతి షాకు తిన్నట్టు చూశాడు. "వ్హాట్?"

సీత నిదానంగా సమాధానమిచ్చింది, చిలక్క చెప్పినట్టు. "ఇంతకుముందు నేనెప్పుడూ ఎవర్నీ ముండ అనలేదు. ఎంచేతో ఇవాళ నాకది చాలా సహజంగా వచ్చేసింది."

సీతాపతి మళ్లీ నవ్వేడు. "హఠాత్తుగా వీర ఫెమినిస్టు వైపోయావేమిటి?"

"లేదండీ. మీలాంటి మేధావులు బృహత్ గ్రంథాలు చదివీ, రాసీ, మళ్లీ మళ్లీ అవే వల్లె వేసుకుంటూ కాలం గడుపుకు పోతూంటారు. మరో పక్క శోభలూ, గాయత్రులూ అనుభూతులూ, సానుభూతులూ అంటూ ఒళ్లు కొవ్వెక్కి కొట్టుకుంటుంటారు. వాళ్లు ఆర్తులు. మీరు ఆర్త త్రాణపరాయణులు. మీకు వాళ్లూ వాళ్లకి మీరూ చాలా అవసరం. మీజాతికీ వాళ్లజాతికీ చెందని, నూటికి తొంభై తొమ్మిదిమందిలో నేనొక మామూలు ఆడదాన్ని. నెమ్మదిగా సావకాశంగా నాటుబండిలా రోజులూ వారాలు గడుపుకుంటూ బతుకుతాన్నేను. మీరందరూ హడావుడిగా ప్రపంచాన్నంతా మీ చర్చలతో ఉద్ధరిస్తూండండి. మీదృష్టిలో నేను మనిషిని కాను. అంతమాత్రంచేత నాకు తరిగిపోయింది కూడా ఏమీ లేదు. తాబేలు తారే బతుకుతుంది, లేడి దూకే బతుకుతుంది అన్న సామెత వినలేదూ?" అంది సీత నిర్వికారంగా.

* * *

(9-23-1987 ఆంధ్రప్రభ వారపత్రికలో, "స్త్రీవాద కథలు" సంకలనంలో, ఇంకా ఎక్కడో(!) ప్రచురితం)